క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో దత్తాత్రేయునికి పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: దత్త జయంతి సందర్భంగా మండల కేంద్రంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తొలుత ఆలయ ప్రాంగణంలో గల ఔదంబర వృక్షానికి పసుపు కుంకుమలు అద్ది దీపదూపాలతో పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని సాయిబాబాను, దత్తాత్రేయుణ్ణి దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం భక్తులకు పండ్లు, ప్రసాదవితరణ జరిగింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు బాసటగా మాజీ ఎంపీ కుటుంబం


దూడ స్మిత్‌ను పరామర్శిస్తున్న శివప్రసాద్

మారేడుమిల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, ఆమె భర్త , నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ శివప్రసాద్‌లు బాసటగా నిలిచారు. మారేడుమిల్లికు చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ దూడ స్మిత్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న వారు ఆయనను పరామర్శించారు. ధైర్యం చెప్పి, భరోసా ఇచ్చి, ఆర్థిక సాయాన్ని అందించారు. తదుపరి వైద్యం, మందులకు తన వంతు సహాయం అందిస్తానని చెప్పారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్నికైన నూతన కార్యవర్గం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా దిలీప్, కార్యదర్శిగా బాలమ్మ, జాయింట్ సెక్రటరీగా మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ప్రశాంతి, జయంతి, అంజలి, జ్యోతి, అమృత, వసంత కుమారిలను ఎన్నుకున్నారు. పలువురు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం


రాజవొమ్మంగిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తుఫాను కారణంగా ఇప్పటి వరకు వాయిదా పడిన వరి పొలాల కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకొన్నాయి. రాజవొమ్మంగిలో ఆరు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు ఏఓ చక్రధర్ తెలిపారు. మండలంలో 6, 230 హెక్టార్లలో వరి సాగు కాగా ఇప్పటి వరకు 2,100 హెక్టార్లలో మాత్రమే కోతలు పూర్తయినట్టు చెప్పారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 40 శాతం మాత్రమే కోతలు పూర్తయినట్టు జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ గణేష్‌కుమార్ చెప్పారు.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బుంగాపుట్టుకు వేసిన తారురోడ్డు


ఆర్టీసీ బస్సు సర్వీసు లేక కాలినడకన వెళ్తున్న గిరిజన మహిళలు

తీరని వెతలు

- రహదారులున్నా.. కానరాని బస్సు సౌకర్యం
- సర్వీసులకు నోచుకోని 60 గ్రామాలు
- ప్రైవేట్ వాహనాలే గతి
- గిరిజనులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు మంజూరయ్యాయి. మారుమూల గ్రామాలకు సైతం తారురోడ్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కొన్నేళ్లుగా అస్తవ్యస్త రహదారులతో అవస్థలు పడిన గిరిజనులకు ఎంతో ఊరట కలిగింది. విశాలమైన రహదారులు తారురోడ్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. కాలిబాటన రాకపోకలు సాగిస్తున్నారు.కొందరూ గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.అధిక చార్జీల వసూళ్లతో పాటు అధిక మంది వాహనాలు ఎక్కి భయం భయంగా ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు.

విస్తారంగా నూతన తారురోడ్లు..

మండలంలో సుజనకోట పంచాయతీ కేంద్రానికి, సుజనపేట, బీటా, వనుగుపుట్టు, రంగబయలు పంచాయతీ కేంద్రానికి, భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి, దారెల పంచాయితీ కేంద్రంలో పాటు పెద్దపేట, లక్ష్మీపురం, బరడ పంచాయతీ కేంద్రాలకు పక్కా తారురోడ్లు ఉన్నాయి. కానీ ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారు. తారురోడ్లు ఉన్నా సుమారు 60 గ్రామాలకు చెందిన గిరిజనులకు ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారాయి. ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో అతివేగంతో వెళ్తూ ఉండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో అమాయక గిరిజనులు ప్రమాదాల బారిన పడి మృత్యువాతకు గురైన సంఘటనలో కోకొల్లలు. ప్రైవేట్ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్టీసీ సర్వీసులు లేక

వారపు సంతలకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తరలించడానికి నానా అవస్థలు పడుతుని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారులు ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని తారురోడ్లు ఉన్న గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.


రంగబయలకు వేసిన తారురోడ్డు

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

మండలంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు గ్రామాల గిరిజనులు బస్సు సర్వీసుపై వినతులు సైతం అందించారు. సుజనకోట, రంగబయలు, లక్ష్మీపురం, దార్రెల పంచాయతీలకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఆర్టీసీ అధికారులతో చర్చిస్తాం.

– ఎం.శ్రీసాయిహర్ష, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

నిత్యం అవస్థలే

తారురోడ్డు సౌకర్యం కలగడం చాలా సంతోషంగా ఉంది. కానీ బస్సు సర్వీసు లేక నిత్యం అవస్థలు పడుతున్నాం. ముఖ్యంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం.అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి. మా రాకపోకలకు పడుతున్న కష్టాలు తీర్చాలి.

– వి.చిట్టిబాబు, తాల్లబుతోట గ్రామం, ముంచంగిపుట్టు

కూలీల కొరతతో రైతులు సతమతం


రాజవొమ్మంగి పరిసరాల్లో వరి కోతలు

రాజవొమ్మంగి: మన్యంలో గత రెండు మూడు రోజులుగా ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతుండగా కూలీల కొరత మాత్రం రైతులను పట్టిపీడిస్తోంది. ఇటీవల తుపాను హెచ్చరికలు, వర్షాలు కారణంగా కోతలు నిలచిపోయాయి. ఇప్పుడు వాతావరణం కాస్త అనుకూలించి ఎండ కాస్తుండడంతో తిరిగి వరి కోత పనులు మొదలయ్యాయి. కాగా అందరికి ఒకేసారి వరి కోతలు సమీపించడంతో కూలీల సమస్య తలెత్తడంతో రైతులు అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అనుకూలంగా ఉన్నచోట యంత్రాల సహాయంతో వరి కోతలు కోస్తున్నారు. యంత్రానికి గంటకు రూ.3,200 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కోత యంత్రం వల్ల పండిన గింజలు నేలరాలి ఎకరాకు మరో రూ.3వేల వరకు నష్టం కలుగుతోందని రైతులు మదన పడుతున్నారు. ఒక వైపు వాతావరణం అనుకూలించక, మరో వైపు అవసరానికి తగ్గట్టుగా కూలీలు దొరకక పలు విధాలుగా నష్టపోవాల్సివస్తోందని శరభవరం, దూసరపాము, రాజవొమ్మంగికి చెందిన పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కూలీ రేటు రోజుకు రూ.500 ఉండగా, ఎకరా నేలలో కోత కోయాలన్న, కోసిన పంట ఇంటికి తేవాలన్నా ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. కూలీ రేట్లు పెరిగిపోవడంతో పెట్టుబడి రెండింతలు పెరిగి కనీసం తిండిగింజలు కూడా మిగలవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 6వేల ఎకరాల్లో వరి సాగయినట్టు అంచనా.

రోజు రోజుకు వరి కోత పనులు ఆలస్యమవుండడంతో పూర్తిగా పక్వానికి వచ్చిన పంట నేల రాలి మరో విధంగా నష్టం చవిచూడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంట తీరా కోతల సమయం వచ్చే సరికి వాతావరణం అనుకూలించక, కూలీలు దొరకక నానా ఇబ్బంది పడుతున్నామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

గొల్లగూడెంలో రహదారి నిర్మించాలి


రేఖపల్లి ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి

చింతూరు: వీఆర్ పురం మండలం రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెంలో నిధులు మంజూరైన సీసీ రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానిక ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామంలోని మోడెం నరేష్ ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు రహదారి నిర్మాణం జరగకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు. వెంటనే రహదారి నిర్మాణం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. దీంతో పాటు ఏడు పంచాయతీల రాకపోకలకు అనువైన అన్నవరం, ఉమ్మడివరం వంతెన నిర్మించాలని విన్నవించారు. ఈ వంతెన నిర్మాణానికి గతంలోనే రూ.4 కోట్లు మంజూరయ్యాయని ఆయా నిధులతో త్వరితగతిన వంతెన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

వ్యవసాయ కూలీల ఆందోళన


ఆందోళన చేస్తున్న వ్యవసాయ కూలీలు

కూనవరం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కూలీలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోండ్రాజుపేట రహదారిపై శనివారం పొలం పనులను నిలిపివేసి ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్ట పడుతున్నా పూట గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీసం రూ. 650 నుంచి రూ.700 వరకు కూలిరేట్లు పెంచాలని కోరారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా కౌలు రేట్లు పెరగకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రేట్లు సాధించుకునే వరకూ పొలం పనులకు వెళ్లేది లేదని స్పష్టం చేస్తున్నారు. న్యాయపరమైన తమ డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. వెంకన్నబాబు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి



సభలో మాట్లాడుతున్న పాంగి ధనంజయ్

చింతపల్లి: మన్యంలో గల ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. చింతపల్లి ఏకలవ్య గురుకుల పాఠశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన ఆశ్రమాల్లో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కనీస పౌష్టికాహారం అందక ఎంతోమంది విద్యార్థులు మృత్యు వాతపడుతున్నారు. విద్యకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పడంలో వాస్తవాలు కనిపించడం లేదన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నేతలు రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


గంజాయి అనర్థాలపై అవగాహన ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

ముంచంగిపుట్టు: మత్తుకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పోస్టర్లుతో అవగాహన ర్యాలీని పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించారు. గంజాయికి దూరంగా ఉండాలి, డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనం అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ యువత భవిష్యత్తును చీకటి చేస్తున్న డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, గంజాయి రవాణా, సాగు చేయడం వల్ల చాలా మంది జీవితాలు జైలు పాలవుతున్నాయన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఏఎస్ఐలు తిరుపతిరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


జెన్‌కో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సీలేరు: గూడెంకొత్త వీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు సీలేరు ఏపి జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు స్థానిక జెన్‌కో ఆస్పత్రి వైద్య సేవలు, జెన్‌కో క్వార్టర్స్‌లలో నివాసం కల్పించాలని, ప్రతీ ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పీస్‌రేట్ వర్కర్లుగా ఉన్న కార్మికులను మ్యాన్‌పవర్ కార్మికులుగా ఎస్టిమేట్‌లో వేయాలని వినతిలో కోరారు. సుభాన్, విష్ణుకుమార్, కాంట్రాక్ట్ కార్మికులు లక్ష్మణరావు, హైడిరాజు, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘం ఎన్నికలు


వట్టిగెడ్డలో ఎన్నికలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది

అరకులోయటౌన్/డుంబ్రిగుడ/అనంతగిరి(అరకులోయటౌన్)/హుకుంపేట/పాడేరురూరల్(అరకులోయరూరల్)/ జి.మాడుగుల/ చింతపల్లి/కొయ్యూరు/సీలేరు/రాజవొమ్మంగి/గంగవరం: జిల్లా వ్యాప్తంగా సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అనంతరం ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, సీలేరు, రాజవొమ్మంగి, గంగవరం మండలాల సాగునీటి సంఘం అధ్యక్షులుగా గురు. కృష్ణమూర్తి, కొండబాబు, రామకృష్ణ, కైలాసరావు, కృష్ణ, పెంటయ్య, బాలయ్యపడాల్, బాలమురళి, పి.వెంకటరమణ, మల్లేశ్వరరావు, చిన్నారావు, దేముడు, చిన్నారావు, కన్నయమ్మ, రాజుపడాల్, బర్సయ్య , నీలేంద్రం, చైర్మన్లు వెంకటరమణ, సత్యనారాయణ, సత్యసుందరరావు, ముసిలి, సోమరాజు తదితరులు ఎన్నికయ్యారు.

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ


వినియోగదారులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

చింతూరు: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం చింతూరులో సబ్‌స్టేషన్ నుంచి మెయిన్‌రోడ్ వరకు జాతీయ ఇంధన పొదుపు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ అవసరం లేనప్పుడు విధిగా లైట్లు, ఫ్యాన్లు ఆపేయాలని, పగటిపూట ఇంటి కిటికీలు తెరచి ఉండడం వలన విద్యుత్ వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. ఫైవ్‌స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు, ఎల్ఈడీ బల్బులు వినియోగించి విద్యుత్‌ను ఆదా చేయాలని వారు సూచించారు. ఇంధన పరిరక్షణ చిట్కాలకు సంబంధించిన కరపత్రాలను వినియోగదారులకు పంపిణీ చేశారు. ఏడీఈ సుధీర్‌బాబు, ఏఈ శ్రీనివాస్, జేఈలు పరశురాం, సతీష్, రాజ్‌కపూర్, లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్


ఆదివాసీ సంఘాల నేతల సమావేశం

ఎటపాక: ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం చెల్లించాలని ఆదివాసీ సంఘాల నేతలు కోరారు. మండలంలోని పాతకొండేపల్లిలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, కోయ ధర్మ ప్రచార సమితి, ఆదివాసీ తలపతుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కోయ సమాజ్ అధ్యక్షుడు సోయం భీమ మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీ పూజారులకు, తలపతులకు గౌరవవేతనాలు అన్ని ఐటీడీఏల పరిధిలో వర్తింపచేయాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ,ఉపాధి రంగాల్లో రక్షణ, భద్రతకు ఆదివాసీ ఉద్యోగ నియామక చట్టాన్ని టీఏసీ తీర్మాణంతో గవర్నర్ ఆమోదంతో భద్రత కల్పించాలన్నారు. నాయకులు లచ్చ, శుక్ల, సోడె మురళి, దుర్గారెడ్డి, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బాబూరావు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ మండి బాబూరావు అన్నారు.మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో జెడ్పీ నిధులు రూ.15లక్షలతో 100 మీటర్ల సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శనివారం సర్పంచ్ బాబురావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబూరావు మాట్లాడుతూ పెదగూడలో సీసీ రోడ్డు, డ్రైనేజీ సమస్యలను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో జెడ్పీ నిధులు కేటాయించారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఎంపీటీసీ గణపతి, వైఎస్సార్‌సీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడికి నిరసన


జడ్డంగి పీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మారేడుమిల్లి పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న ఏఎన్ఎం పద్మావతిపై రోగి బంధువు దాడికి పాల్పడినందుకు రాజవొమ్మంగి మండంలోని జడ్డంగి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది శనివారం నిరసనకు దిగారు. వైద్యాధికారి నాగార్జున మాట్లాడుతూ రాత్రివేళలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ఈ విధంగా దాడికి దిగడం అమానుషం అన్నారు. ఇటీవల మారేడుమిల్లి పీహెచ్‌సీలో జరిగిన సంఘటనలో ఏఎన్ఎంపై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు.

వేర్వేరు చోట్ల లోక్ అదాలత్‌ల్లో 206 కేసుల పరిష్కారం

అరకులోయటౌన్: అరకులోయ ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 61 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు సూపరింటెండెంట్ వై.వి.చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి కోర్టు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అనకాపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులు విచారించారు. ఇందులో భాగంగా 8 కేసులు రాజీ కుదుర్చుకోగా రూ.90 వేలు జరిమానా, 41 ఎక్సైజ్ కేసుల్లో రూ. 2.20లక్షల జరిమానా, 3 పేకాట కేసుల్లో రూ. 6,600 జరిమానా, 9 నేరం అంగీకరించదగ్గ కేసుల్లో రూ. 15, 250 జరిమానా విధించి, కేసులను పరిష్కారించినట్టు ఆయన తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ వీడియో కాన్ఫరెన్స్‌లో అరకులోయ సీఐ ఎల్.హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, ఎక్సైజ్ సీఐ సంతోష్, కోర్టు సిబ్బంది రామరాజ్ మల్లుదొర, పి.జనార్దన్, మోహన్‌రావు, అడ్వకేట్‌లు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగల, రంపచోడవరం జేఎఫ్‌సీఎం కోర్టుల పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 145 కేసులు పరిష్కరించినట్టు న్యాయమూర్తి పి.బాబు తెలిపారు. వీటిలో 105 సారా కేసులు ఉండగా, 39 క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. మరొకటి మెయింటినెన్స్ కేసు పరిష్కరించామన్నారు. ఆయా కేసులు ద్వారా కాంపౌండింగ్ ఫీజుగా రూ.4.93లక్షలు చెల్లించనట్టు తెలిపారు.

స్వయం ఉపాధికి బాటలు

- తాటాకుల వస్తువుల తయారీపై శిక్షణ
- ఆశాజనకంగా మార్కెట్
- గిరిజనులకు ఆర్థిక ఆసరా

రంపచోడవరం: కుటీర పరిశ్రమలు గిరిజనుల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ మేరకు గిరిజనులకు పలు వృత్తుల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. దేవీపట్నం మండలం అగ్రహారంలోని పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీ ఉంది. ఇక్కడ సుమారు 40 కుటుంబాలు ఉంటున్నాయి. కాలనీలో దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. చాలా మంది వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. అంతంతమాత్రం ఆదాయంతోనే పోషణ సాగిస్తున్నారు. కాలనీలో ఉన్న గిరిజన మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రకృతి స్వచ్ఛంద సంస్థ, ఎస్.ఎస్.సీ.డబ్ల్యూ సహకారంతో ముందుకొచ్చింది. ఇందులో భాగంగా చేతివృత్తుల్లో నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తుంది. తాటాకులతో వస్తువుల తయారీపై గిరిజనులకు శిక్షణ ఇస్తుంది. తాటాకులతో బుట్టలు, పూజ బస్కెట్, బోకేలు, దండలు, టోపీలు, వంటివి తయారీలో శిక్షణ పొందుతున్నారు. వీటి తయారీకి తాటిచెట్టు ముచ్చ ఆకును సేకరిస్తారు. దానిని ఎండలో అరబెట్టి, తరువాత నీటిలో నానబెట్టి, రంగులు కలుపుతారు. దీంతో తాటాకు అంటుకున్న రంగులు ఎక్కువ కాలం ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు. ప్రస్తుతం 44 మంది గిరిజనులు శిక్షణ పొందుతున్నారు. మరో 20 రోజుల్లో శిక్షణ పూర్తవుతుందని చెప్పారు. ప్రకృతి సంస్థ డైరెక్టర్ గురుగుల సుబ్బారాజు మాట్లాడుతూ తాటాకులతో తయారు చేసిన వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో మార్కెట్ చేసేందుకు కృషి చేస్తున్నామని చెబుతున్నారు.


శిక్షణ పొందుతున్న మహిళ


తయారు చేసిన వస్తువులను చూపిస్తున్న గ్రామస్తులు


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన వస్తువులు

ఆర్థిక భరోసా

ఇంటి వద్ద తాటాకులతో వస్తువుల తయారీకి సమయం కేటాయించడంతో ఆర్థికంగా కొంత భరోసా లభిస్తుంది. తాటాకులతో వస్తువులు తయారు చేసి మార్కెట్ చేయాలనేది మా లక్ష్యం. ప్రస్తుతం తాటాకుల వస్తువులతో గిరాకీ ఉంది.

–కెప్పల అబ్బాయిరెడ్డి, అగ్రహారం ఆర్అండ్ ఆర్ కాలనీ

మార్కెట్ బాగుంది

తాటాకులతో వివిధ రకాల వస్తువుల తయారీలో నైపుణ్యం సాధించాం. శిక్షణ పూర్తయిన తరువాత ఇంటి వద్ద వస్తువులు తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో బాగా అమ్ముడుపోతున్నాయి. ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

–కారం అమ్ములు , అగ్రహారం ఆర్అండ్ఆర్ కాలనీ